


హస్తకళల ప్రదర్శనను ప్రారంభించిన కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా క్రాఫ్ట్ బజార్ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఆవరణ వద్ద ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చేతివృత్తిదారులు, నేత కళాకారులు తమ వృత్తి నైపుణ్యంతో పలు వస్తువులను తయారు చేసి ఇక్కడ ప్రదర్శనకు ఉంచడమే కాక, విక్రయించనున్నారని చెప్పారు. విజయనగరానికి ఎవరు వచ్చినా ఇక్కడ ప్రజలు ఆదరిస్తారని.. నైపుణ్యం ఉంటే ప్రోత్సహిస్తారని తెలిపారు. ఇక్కడికి వచ్చే వివిధ రాష్ట్రాల్లో తయారైన వస్తువులు లభ్యమవుతాయని, ప్రజలంతా ప్రదర్శనను తిలకించి, కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ డి.రమేష్, సొసైటీ ప్రతినిధులు నసీం, సలీం తదితరులు పాల్గొన్నారు.



వైద్య కళాశాల భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రులు విడుదల రజని, బొత్ససత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రభుత్వ వైద్య కళాశాలలో


వచ్చేనెల నుంచి తరగతులు

- కళాశాల పనులను పరిశీలించిన వైద్యారోగ్య శాఖ మంత్రి రజని
- అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయని వాటిలో నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న ఐదు కళాశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తున్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. వచ్చేనెల నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారపు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజనీ శనివారం వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్రకే తలమానికంగా రూ.500 కోట్లతో 70 ఎకరాల్లో నిర్మితమవుతున్న విజయనగరం వైద్య కళాశాల నిలవనుందని మంత్రి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. స్కిల్ ల్యాబ్, ప్రధాన కళాశాల భవనం, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, సమావేశ మందిరాలను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు.

విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ తండ్రీ కొడుకుల కృషి ఫలితంగానే రాష్ట్ర ప్రజలకు 19 వైద్యకళాశాలలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. వైద్య కళాశాల పనులు నిరంతర పర్యవేక్షణ వల్లే ఇంత త్వరగా పూర్తయ్యాయని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి స్థాయిలో అయిపోతాయని పేర్కొన్నారు. గిట్టని వాళ్ల చెబుతున్నట్లు రిజర్వేషన్ ప్రక్రియకు గానీ, పేద విద్యార్థులకు గానీ ఎలాంటి నష్టం జరగదని, పారదర్శకంగా సీట్ల భర్తీ ప్రక్రియను చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా వైద్య కళాశాల ప్రారంభోత్సవంతో పాటు, గిరిజన యూనివర్శిటీ పనులకు శంకుస్థాపన చేయనున్నామని మంత్రి వివరించారు. వైద్య కళాశాల అందుబాటులోకి రావడంతో ఉమ్మడి జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల, డిఎంహెచ్ఒ భాస్కరరావు, వివిధ విభాగాల అధిపతులు, వైద్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బిఎస్ఆర్ మూర్తి కన్నుమూత

ప్రజాశక్తి-గజపతినగరం

వైద్యరంగంలో విశిష్ట సేవలందించి ప్రముఖ వైద్యులుగా పేరుగాంచిన డాక్టర్ బిఎస్ఆర్ మూర్తి (85) శనివారం రాత్రి కన్ను మూశారు. పది రోజుల క్రితం గుండెపోటు, పక్షవాతం రావడంతో ఆయనను విజయనగరం లోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించారు. కొద్దికోలుకోవడంతో తన కుమార్తెకు చెందిన గాయత్రి ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. బిఎస్ఆర్ మూర్తి అంటే జిల్లాలో తెలియని వారు ఉండరు. సుమారు 50ఏళ్లుగా గజపతినగరం చుట్టుపక్కల మండలాల ప్రజలకు ఆయన వైద్య సేవలు అందించారు. వైద్య రంగంలో ఆయన ఎన్నో జాతీయ అవార్డులు పొందారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో బటన్‌హోల్ సిస్టమ్‌ను కనిపెట్టి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. లయన్స్ గవర్నర్‌గా, విజయనగరంలోని ప్రేమ సమాజం అధ్యక్షులుగా సేవలందించారు. లయన్సు పాఠశాల స్థాపించి విద్యార్థులకు విద్యనందించారు. ప్రత్యక్ష రాజకీయాల్లో లేనప్పటికీ పరోక్షంగా కీలకపాత్ర పోషించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా, సతీమణి డాక్టర్ ఆదిశేషు, కుమారుడు డాక్టర్ నాగ నరేంద్ర కొద్ది కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణవార్తతో గజపతి నగరంలో విషాదం అలముకుంది.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు ● రాజాం నియోజకవర్గపై మంత్రి బొత్సతో కలిసి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు అధికారులను ఆదేశించారు. బిల్లులు పెండింగ్ లేకుండా వెంట వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం రాజాం నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జరుగుతున్న పనులు, గడపగడపకు మన ప్రభుత్వం, వైద్యారోగ్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ కార్యక్రమాల వల్ల గ్రామాల్లో వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు తీసుకున్న చర్యలను చర్యలను వివరించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసే, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి కోరారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల విషయంలో అధికారులు ఎక్కడా రాజీ పడవద్దని అన్నారు. ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, గృహ నిర్మాణానికి వాగులు, వంకలు తదితర థర్డ్ ఆర్డర్ రీచుల్లో దొరికే ఇసుకను, అలాగే మట్టి, గ్రావల్‌ను ఉచితంగా తీసుకు వెళ్లవచ్చని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ నిర్ణయమని, ఈ విషయంలో ఎక్కడా అభ్యంతరాలు పెట్టకూడదని అధికారులను ఆయన ఆదేశించారు. అయితే ఇలాంటి చోట ఇసుక తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ యంత్రాలను ఉపయోగించకూడదని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు అంశాలపై, రాష్ట్ర ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అప్పటికప్పుడే వారి సమస్యలను మంత్రి పరిష్కరించారు. అసంపూర్తిగా వదిలేసిన పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని, లేని చోట కొత్తగా మండలానికి రూ . 60 లక్షలు విలువైన పనులను ప్రతిపాదించాలని సూచించారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు చేయడం తప్పనిసరి అని అన్నారు. ఈ విషయంలో అధికారులు ఎక్కడైనా అలసత్వం చూపిస్తే, రైతులు నష్టపోతారని చెప్పారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ,ప్రస్తుతం పలు రోడ్లను విస్తరిస్తున్నామన్నారు పాలకొండ ఉల్లివలస, నారాయణపురం, సంతకవిటి- రాజాం తదితర రోడ్లను అభివద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలునాయుడు

సమావేశంలో టిటిడి బోర్డు చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, డిఆర్ఒ ఎం.గణపతి రావు, సిపిఒ పి.బాలాజీ, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వివిధ శాఖల అధికారులు, రాజాం నియోజక వర్గ పరిధిలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విక్రయశాల ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య ఏర్పాటు చేసిన చిరుధాన్యాల విక్రయశాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని శనివారం ప్రారంభించారు. ఈ స్టాల్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఈ స్టాలు పక్కనే ఏర్పాటు చేసిన గెటోస్ కేఫ్ ను కూడా మంత్రులు ప్రారంభించారు.

కార్యక్రమంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిఆర్ఒ ఎం గణపతి రావు, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్‌పి ఆవరణలో చిరుధాన్యాల విక్రయశాలను ప్రారంభిస్తున్నమంత్రులు రజని, బొత్స

ఎన్ఇపితో ప్రభుత్వ విద్యకు ముప్పు

●ఆరో రోజుకు చేరిన ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర ● అడుగడుగునా ఘన స్వాగతం

ప్రజాశక్తి-చీపురుపల్లి, గరివిడి, నెల్లిమర్ల

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విధానంతో ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఎన్‌పిని రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ఆరోరోజు శనివారం రాజాం నుంచి ప్రారంభమై చీపురుపల్లి, గరివిడి, గుర్ల మీదుగా నెల్లిమర్ల చేరుకుంది. అన్నిచోట్లా ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. చీపురుపల్లిలో సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, ఎ.గౌరినాయుడు ఆధ్వర్యాన స్వాగతం పలుకగా, నెల్లిమర్లలో సిఐటియు నాయకులు బి.సుధారాణి, కె.రామారావు ఆధ్వర్యాన ఎస్ఎఫ్ఐ నాయకులకు తిలకం దిద్దుతూ, పూలు జల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజాం, చీపురుపల్లిలో జరిగిన సభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డికి బటన్ నొక్కడంపై ఉన్న శ్రద్ధ,విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంపై లేదన్నారు.



చీపురుపల్లి : సభలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు వెంకటేష్

సంక్షేమ హాస్టల్స్ లో విద్యార్థులు పరిస్థితి అధ్వానంగా మారిందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి,వారి ఆకలి తీర్చాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కోకన్వీనర్ ఎస్.లావణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని, దానిలో భాగంగా జీవో 77 తీసుకొచ్చి మొత్తం ఉన్నత విద్యకు మంగళం పాడేసారని అన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలను నిర్మించి, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వెంకీ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి, లేని పక్షాన సంగ్రామ యాత్ర సమర యాత్రగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ పావని, ఎం.హర్ష, డి.రాము, వంశీ తదితరులు పాల్గొన్నారు. సైకిల్‌యాత్రకు మద్దతు తెలిపిన వారిలో అంగన్ వాడీ యూనియన్ నాయకులు పల్లి మంగ లక్ష్మీ, మధ్యాహ్న భోజన సంఘం నాయకులు సంతోషి, పైడి రాజు, సీత, విద్యుత్ హమాలీ సంఘం నాయకులు పతివాడ పెద రాంబాబు, కె.శ్రీను, నగర పంచాయతీ కార్మిక సంఘం నాయకులు హరి బాబు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్లలో స్వాగతం పలుకుతున్న సిఐటియు నాయకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డివిజి శంకర్రావు

ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఎస్‌టి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు శనివారంరాత్రి ఆకస్మిక తనిఖీ చేశాను. విద్యార్థులతో, అధ్యాపకులతో మాట్లాడారు. డిజిటల్ క్లాస్ రూం,కిచెన్,సిక్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆహారం, చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. 350 మంది విద్యార్థినులున్న హాస్టల్ కు వాచ్ మన్ లేకపోవడం, ఎఎన్ఎం సేవలు లేకపోవడం చైర్మన్ దృష్టికి వచ్చాయి. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రూ.41లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 49, 50 డివిజన్లలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. రూ 41 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 200 రూపాయలకే కుళాయి కనెక్షన్ల దరఖాస్తులను పలువురుకు అందజేశారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజాస్పందాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలువలు, రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి కట్టుభుక్త తవిటి రాజు, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి మాట్లాడారు. వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు,నడిపిల్లి ఆదినారాయణ, కనుగుల రాజా, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు. బెస్తా కాలనీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జి కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. అదే ప్రాంతంలో పైప్ లైన్ ద్వారా వృథాగా పోతున్న నీటిని గమనించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు.

పక్కాగా రీ సర్వే ప్రక్రియ

పురపాలక శాఖ కమిషనర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే ద్వారా భూ యజమానులకు భూమి పై శాశ్వత హక్కుతో పాటు, రక్షణ కూడా కల్పించాలన్నదే ధ్యేయమనికమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రణాళిక అధికారులకు, సచివాలయ కార్యదర్శులకు, విఆర్ఒలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఆయన రీసర్వే ప్రయోజనాలు, ఆవశ్యకత గూర్చి వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అపోహలు వంటి విషయాలపై కార్యదర్శుల నుండి అడిగి తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలను చూపారు. అనంతరం ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ ద్వారా భూ యజమానులకు ఎంతో ప్రయోజనం చేకూరనున్నదని అన్నారు. భవిష్యత్తు తరాలలో భూ తగాదాలు లేకుండా పూర్తి రక్షణగా ఉంచడమే జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షణ పథకం ఉద్దేశమని అన్నారు. ఇప్పటివరకు 123 పురపాలక సంఘాలకు గాను 96 పురపాలక సంఘాలలో డ్రోన్ సర్వే పూర్తయిందని అన్నారు. భవన నిర్మాణ అనుమతులు కోరినప్పుడు గాని, ఇంటి కొళాయిలు అవసరమైనప్పుడు గాని ఆస్తి వివరాలు పురపాలక సంఘానికి అవసరమవుతాయని, కానీ పూర్తిస్థాయిలో భూమి రికార్డులు సంస్థలో ఉండవని, దీంతో రీ సర్వే చేపట్టడం ద్వారా పూర్తిస్థాయి వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామ కంఠం లో ఉన్న వివరాలను, మ్యాపింగ్ చేసిన వివరాలను, భూ యజమాని వద్ద గల వివరాలను సమగ్ర పరిశీలన జరిపిన అనంతరం హక్కు పత్రాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సర్వే ప్రత్యేక అధికారి సుబ్బారావు, అడిషనల్ డిటిసిపి ప్రభాకర్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లు, అడ్మిన్, ప్రణాళిక కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కోటేశ్వరరావు

హేండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశకి-విజయనగరం టౌన్

హేండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా బి. శేఖర్, వడ్డాది మల్లేశ్వరరావు, కోశాధికారిగా ఎన్.కాళిదాసు ఎన్నికయ్యారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్ లో జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఎస్.గోపి కృష్ణ హాజరయ్యారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఉల్లంఘనకు గురవుతోంది

జెవివి వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారతదేశ ప్రజల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో అంశాలు అడుగడుగునా ఉల్లంఘనలకు గురవుతున్నాయని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జెవివి ఆధ్వర్యంలో శనివారం గురజాడ పాఠశాలలో రాజ్యాంగ హక్కులు-ఉల్లంఘనలు అనే అంశంపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మంచి భావాలతో రచించారని అన్నారు. అయితే పాలకులు మాత్రం రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల హక్కులను కాల రాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే పాలకులని రాజ్యాంగం చెబుతుంటే మన పాలకులు మాత్రం తాము పాలకులం, ప్రజలు బానిసలు అన్న రీతిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని అంశాల పట్ల ప్రజలకు అవగాహన అవసరమని పేర్కొన్నారు. జెవివి జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ నాయకులు డాక్టర్ ఎంవి ఆర్ కృష్ణాజి, గంట్రేటి లక్ష్మణరావు, డాక్టర్ ఎంవిఆర్ వెంకట్రావు, జిల్లా పూర్వ అధ్యక్షుడు అల్లూరి శివ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, షిణగం శివాజీ, పి. షణ్ముఖరావు, గురజాడ పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జెవివి నాయకులు బ్రహ్మారెడ్డి

సీతంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో వెంచర్ కాపిటల్ ఫండింగ్, ఏంజెల్ ఇన్వెస్టుమెంట్ పై ఇన్స్టిట్యూషనల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రీన్జామ్స్ సహ వ్యవస్థాపకులు వరుణ్ జామి విచ్చేశారు. వరుణ్ జామి తాము ఏ విధంగా స్టార్ట్ అప్ కంపెనీని మొదలు పెట్టి వ్యవసాయ వ్యర్థాలనుంచి ఇంటి కట్టడాలకు ఉపయోగపడే ఇటుకలను ఏ విధంగా తయారుచేసి లాభదాయకమైన వ్యాపారంగా అభివృద్ధి చేశారో వివరించారు . కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు పాల్గొన్నారు.

స్టెప్పులేసిన సిటియు విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులు విజయనగరంలోని పలు ప్రాంతాల్లో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మాయూర్ అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు విద్యార్థుల నృత్య ప్రదర్శనలను తిలకించారు. గిరిజన విశ్వవిద్యాలయం 5వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా కలెక్టరేట్, కోట జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ లలో స్టూడెంట్స్ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతాల్లో రోడ్డుపై ఒక్కసారిగా యునివర్సిటి విద్యార్థులు చేసిన డాన్స్ షో చూపరులను ఆకట్టుకుంది. సినిమా, ఫోక్ తదితర పాటలకు స్టెప్పులతో విద్యార్థులు అదరగొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన థింసా డాన్స్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌వద్ద డాన్సులు చేస్తున్న సిటియు విద్యార్థులు

మంత్రి గారికి బాధ్యత లేదా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇప్పటికే జిల్లాలోని జ్యూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. ఒక్కగానొక్క భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ పేరుతో మూసివేశారు. నష్టాలపేరిట ఎన్‌సిఎస్ సుగర్స్‌ను మూసివేయింప జేయడంతోపాటు దానికి సంబంధించిన ఆస్తులు దారదత్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారు 50వేల కుటుంబాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయాయి. ఒకప్పుడు గౌరవంగా బతికే కుటుంబాలు ఇప్పుడు పుట్టెడు కష్టాల నడుమ బతుకీడుస్తున్నాయి. రోజుకు 8గంటలపాటు పనిచేస్తూ నిబ్బరంగా బతికే జ్యూట్ కార్మికులు పొట్టచేతపట్టుకుని ఊరుగాని ఊళ్లకు వలసపోయారు. కొంతమంది సెక్యూరిటీ గార్డుల అవతారమెత్తారు. ఇదంతా గడిచిన దశాబ్ద కాలంలో కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ మంత్రి స్పందించలేదు. తాజాగా విద్యుత్ ఛార్జీల పెంపుతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలో 36 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండగా, ఒక్క విజయనగరంలోనే 21 పరిశ్రమలు ఉన్నాయని అన్నారు. ఇందులోనూ మంత్రి బొత్స ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నాయి. మొత్తంగా ఫెర్రో పరిశ్రమలపై ప్రత్యక్షంగా 60వేలు, పరోక్షంగా 6 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఫెర్రో క్రోం తయారీలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ భారంతో పరిశ్రమలు చాలా కాలంగా ఆర్థిక ఇబ్బందుల నడుమ నడుస్తున్నాయి. మార్చి 31 వరకు ఈ పరిశ్రమలకు ఒక యూనిట్



విద్యుత్ ఛార్జీ రూ.4.95 ఉండగా, ఏప్రిల్ 1 నుంచి ఒక యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.8.55లకు ప్రభుత్వం పెంచింది. జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ఫెర్రో పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు రూ.4కు, ఖతార్ వంటి దేశాల్లో రూ.3చొప్పున విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీలపై రాయితీలు ప్రకటించాల్సిన పరిస్థితుల్లో భారాన్ని మరింతగా మోపడంతో పలు పరిశ్రమలు మూతపడ్డాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో 5, గరివిడి ప్రాంతంలో 3, కొత్తవలస ప్రాంతంలో 1 ఇప్పటికే మూతపడగా, గరివిడి ఫేకర్ సహా మరికొన్ని పరిశ్రమల్లో ఉత్పత్తిని తగ్గించాయి. మరికొన్ని మూసివేత దిశగా అడుగులు వేస్తున్నాయి.

ఇటువంటి పరిశ్రమల్లో ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పరిశ్రమలను కాపాడాల్సిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ 'లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా?' అంటూ చేసిన వ్యాఖ్యల పట్ల కార్మికులు మండిపడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యాలకు నిర్దిష్టమైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి వైఖరి ఇలాగే ఉంటే ప్రభుత్వాన్నే రోడ్డుపైకి ఈడ్చాలంటూ ఇటీవల నగరంలో జరిగిన ఫెర్రో ఎల్లాయిస్ సదస్సు నిర్ణయించింది. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల పరిరక్షణకు ఈనెల 7న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టాలని, అనంతరం వారం రోజులపాటు పరిశ్రమల వద్ద నిరసన దీక్షలు చేపట్టాలని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఆగస్టు చివరి వారంలో ఏకంగా చలో అసెంబ్లీ నిర్వహించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానిం చింది. మంత్రి బొత్స వైఖరిని కూడా తప్పుపట్టింది

జరజాపుపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

నెల్లిమర్ల: స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో, తిరుమల మెడికవర్ హాస్పిటల్ సహకారంతో జరజాపుపేటలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ప్రారంభించారు. శిబిరంలో 128 మంది పేద ప్రజలకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. శిబిరంలో నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, స్టేట్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు నల్లి శ్రీను, పొంద్రంకి సత్యనారాయణ, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శేఖర్, ఎంఎం నాయుడు, మద్దిల శ్రీను, కనకల హైమావతి, అవనాపు మురళి, అవనాపు విజయ్ భాస్కర్, సముద్రపు వెంకటరమణ, నల్లి శివ ప్రసాద్, తిరుమల మెడికవర్ హాస్పిటల్ తరఫున డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ సోవాజ్ సేవలు అందించారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ దుర్గా ప్రసాద్, సేల్స్ మేనేజర్స్ శివ కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

వేపాడ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణకు సంబంధించిన కరపత్రాలను ఎంపిపి డి. సత్యవంతుడు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఏ ధరణి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ సంబంధించిన ఆల్బెండ జోల్ మాత్రలను అంగన్వాడి కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, వేపాడ, బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎంపిడిఒ పట్నాయక్, ఎంఇఒ బాల భాస్కరరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి అలీ, వైసిపి నాయకులు బీల నరేష్, బోజంకి శ్రీను, పైడి బాబు పాల్గొన్నారు.

15 నుంచి పంచాయతీల్లో డిజిటల్ సేవలు

నెల్లిమర్ల: మండలంలోని పలు పంచాయతీల్లో ఈ నెల 15 నుంచి డిజిటల్ రూపంలో సేవలు అందిస్తామని ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆయా గ్రామ పంచాయతీల ద్వారా డిజిటల్ రూపంలో సేవలు అందించడానికి ప్రభుత్వం డిజిటల్ సేవలు రూపొందించిందన్నారు. గ్రామస్తులు ఇంటి పన్నుల చెల్లింపు, ధ్రువపత్రాలు పొందడానికి నగదు రూపంలో చెల్లించకుండా డిజిటల్ రూపంలో చెల్లించి గ్రామ పంచాయతీ ద్వారా సేవలు పొందవచ్చన్నారు. ఇప్పటికే ఆయా పంచాయతీల్లో డిజిటలీకరణ చేశామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దొగ్గ సత్యవంతుడు

'ఆడుదాం ఆంధ్ర' పై సమావేశం

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ పట్నాయక్ అధ్యక్షతన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం పై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ గ్రామాల్లో 17 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఆటల పోటీలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రికెట్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు సచివాలయాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఈ సమావేశం ఎంఇఒ పి. బాలభాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఓటరు పరిశీలన చెయ్యాలి

బొబ్బిలిరూరల్: ప్రతి బిఎల్ఒ ప్రతి ఇంటిలో ఓటర్ల పరిశీలన చెయ్యాలని తహశీల్దార్ డి. రాజేశ్వర్రావు అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2024 అనుసరించి ఓటర్ల జాబితా ప్రక్షాళన నిమిత్తం ఇంటింట సర్వేలో భాగంగా వివిధ గృహాలకు తమ ఓటర్ లిస్టులో ఉన్న ప్రాప్తికి తమ ప్రాంతంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి బిఎల్ఒ సందర్శించి ఆ ఇంట్లో ఉన్న ఓటర్‌లను తన వద్ద ఉన్న ఓటర్ లిస్ట్ తో సరి చూడాలన్నారు. చూసి కొత్తగా చేర్చాల్సిన ఓటర్‌లను, శాస్విత, బదిలీ అయిన ఓటర్‌లను, చనిపోయిన ఓటర్లను తొలగించడం, ఏవైనా పేరు మార్పులు, ఓటర్ల బదిలీలు అంశాలను ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన ఫామ్స్ ద్వారా ఎన్నికల ఓటర్ల జాబితాను సవరించాలన్నారు. ఈ సమావేశంలో డిజిగ్నేటెడ్ ఎఇఆర్ఒ హెచ్డీ గౌరిశంకర్రావు, ఎన్నికల డిటి శ్రీనివాసరావు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి బాల భాస్కర్ రావు శనివారం పరిశీలించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల నోట్ బుక్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ఆవరణ అంతా పరిశీలన చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆవరణ అంతా పచ్చదనంతో కలకలలాడే విధంగా శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: పట్టణంలోని 31వ వార్డు దళిత మహిళా వాలంటీర్‌ను వేధించిన వైసిపి కౌన్సిలర్ చోడిగంజి అనసూయమ్మ, ఆమె భర్త రాజగోపాల్ పై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు వై.గోపాలం డిమాండ్ చేశారు. వాలంటీర్‌ను వేధించిన వారిని వైసిపి నుంచి సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ దళిత మహిళా వాలంటీర్‌ను వేధించడం దుర్మార్గమన్నారు. వాలంటీర్‌ను వేధించిన వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి కౌన్సిలర్, ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాధిత వాలంటీర్ జి.విజయలక్ష్మి, అంబేద్కర్ పోరాట సమితి సభ్యులు, మాల మహానాడు సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- బాడంగి

పెండింగ్‌లో ఉన్న బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు మండల నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారుగా 60 మంది గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నారని వీరికి నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోసిస్తారని ప్రశ్నించారు. జీతాలు అడగడానికి వస్తున్న గ్రీన్ అంబాసిడర్లను చూసి ఎమ్మెల్యే సమస్య తెలుసుకోకుండా వెళ్లిపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఎంపిడిఒ, ఎంపిపి, జెడ్‌పిటిసికి వినతి పత్రమిచ్చారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కారం చేస్తామని వారు హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

బకాయి వేతనాలు చెల్లించాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలు బకాయి వేతనాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. ఈశ్వరరావు, సిహెచ్ వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులు, ఉద్యోగోన్నతులు పొందిన హెచ్‌ఎంలకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. క్యాడర్ స్ట్రెంత్ అనే సాకు చూపించి రెండు నెలలు జీతాలు ఆపడం ఉపాధ్యాయులపై అణిచివేత చర్యంగా భావిస్తున్నామని అన్నారు. సమావేశంలో ఎ. సదాశివరావు, ఆర్.కృష్ణ, ఎన్‌వి పైడిరాజు, ఎమ్. వి. రమణ ఎవి శ్రీను. మూర్తి వి.అప్పలరాజు, వై.మధుసూదనరావు, సిహెచ్ పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ రింగ్ కోర్టుకు 6 ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

యూనియన్ బ్యాంక్ మేనేజర్ వివేక్ స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న బాక్సింగ్ రింగ్ కోర్టుకు 6 ఫ్యాన్లు వితరణ అందజేశారు. సిఇఒ బి. రాంగోపాల్, చీఫ్ కోచ్ బాలాజీ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ వివేక్, ప్రసాద్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. బాక్సింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథకుమార్, శాప్ కోచ్ బి. ఈశ్వర రావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఇ రాజు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు దాడికి టిడిపి నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుంగనూరులో చంద్రబాబు మీద రాళ్ల దాడికి నిరసనగా శృంగవరపుకోట ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి దేవి బొమ్మ జంక్షన్ కూడలి వరకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో శనివారం టిడిపి నాయకులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ పుంగనూరు ఘటన అమానుషమన్నారు. దాడులు చేయడం, వ్యక్తిగత విమర్శలు చేసి భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం పిరికిబంధలు చేసే చర్యలుగా భావించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం యువత, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి మ్యానిఫెస్టో మహిళలకు వరం


నెల్లిమర్ల: మహాశక్తి మ్యానిఫెస్టో వరం వంటిదని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. శనివారం నగర పంచాయతి పరిధి జరజాపు పేట16, థామస్ పేట 15వార్డులో మహాశక్తి మ్యానిఫెస్టో పై టిడిపి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు మహిళలను దృష్టిలో పెట్టుకొని మ్యానిఫెస్టోలో మహాశక్తి కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. తల్లికి వందనం పేరిట ఏడాదికి 15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి ప్రతీ స్త్రీకి నెలకు 1500, దీపం పథకం కింద 3ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాలు ప్రత్యేకంగా మహిళల కోసం ప్రవేశ పెట్టడం హర్షింపదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలా వతి, కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, కౌన్సిలర్లు కె. కళావతి, ఎల్. హైమావతి, కాళ్ళ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న మహిళా నాయకులు

చంద్రబాబుపై దాడి అమానుషం

బాడంగి: చిత్తూరు జిల్లా పుంగునూరులో చంద్రబాబుపై దాడి చేయడం అమానుషమని టిడిపి ఎస్‌టి రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. శనివారం ఆయన తన స్వగ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి గూండా రాజకీయం తప్ప ఇంకా ఏది చేత కాదన్నారు. త్వరలోనే వైసిపికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఎన్ని దాడులు చేసిన చంద్రబాబుని సిఎంను చేసే తీరుతారని చెప్పారు.



పి. గౌరు



ఎస్‌కోట: నిరసన ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

ఎలక్ట్రికల్ అధికారులు పై చర్యలు ఏవి?

మండలంలోని పూడివలస గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు చావుకి కారణమైన ఎలక్ట్రికల్ అధికారులు పై చర్యలు తీసుకోకుండా చిన్న ఉద్యోగైన సచివాలయం లైన్ మ్యాన్, రైతు పై చర్యలు తీసికోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. గవర్నమెంట్ జిఒ ప్రకారం సచివాలయం లైన్ మ్యాన్‌కి చనిపోయిన రైతులు లైన్స్‌కి ఎటువంటి సంబంధం లేదన్నారు. పక్క ప్రణాళిక ప్రకారం ఆయన్ని బాధ్యతలు నుండి తప్పించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. బాధ్యత వహించాల్సిన ఎలక్ట్రికల్ అధికారులు మండలంలోని చాలా గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఉద్యోగం చేయడం లేదని విమర్శించారు. శనివారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఇదే విషయంపై విమర్శలు చేశారన్నారు.

నాగచైతన్యకు బొబ్బిలి వీణ

ప్రజాశక్తి- బొబ్బిలి

అక్కినేని నాగచైతన్యకు బొబ్బిలి అక్కినేని ఫౌండేషన్ అధ్యక్షులు లంక వాసుదేవరావు విశాఖలో బొబ్బిలి వీణను శనివారం బహూకరించారు. బొబ్బిలిలో అక్కినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక కార్యక్రమాలను నాగచైతన్యకు వివరించారు. సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న లంక వాసుదేవరావును నాగచైతన్య ఈ సందర్భంగా అభినందించారు.

సుప్రీంకోర్టు స్టే బిజెపికి చెంపదెబ్బ

ప్రజాశక్తి- బొబ్బిలి

కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దుపై సుప్రీంకోర్టు స్టే విధించడం బిజెపికి చెంప దెబ్బలాంటిదని పిసిసి సభ్యులు ముమ్వల శ్రీనివాసరావు, ముగడ వెంకట రమణ అన్నారు. ఎంపి సభ్యత్వం రద్దుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో కాంగ్రెసు కార్యాలయంలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఆదరణ పెరగడంతో బిజెపి ఓర్వలేక రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టి సభ్యత్వం రద్దు చేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంగల్ నారాయణరావు, మండల అధ్యక్షులు పత్రి రాజశేఖర్ రావు, బొబ్బిలి యువజన నాయకులు మండపాక శ్రీనివాస రావు, గోపాలరావు, సూర్యప్రకాష్, పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ అన్నారు. స్థానిక రాజా కళాశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటి విద్యార్థులను గౌరవించాలన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ప్రసన్నకుమార్, ప్రేమలత, ఎస్ఐ జ్ఞానప్రసాద్, ప్రిన్సిపాల్ వీరేంద్రకుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ర్యాగింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్‌కోట ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ర్యాగింగ్ చట్టం గురుంచి వివరించారు. ర్యాగింగ్ జరిగినపుడు భయపడకుండా యాంటి ర్యాగింగ్ కమిటీకి, పోలీసు శాఖకి ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల స్థాయి విద్యా సంస్థలు ర్యాగింగ్ వ్యతిరేక నిబంధనలు గురుంచి తమ కరపత్రాలలో, ప్రవేశ దరఖాస్తులలో విధిగా ముద్రించాలన్నారు. ఈ సదస్సులో ఎస్ఐలు జి.లోవ రాజు, యన్.రమ్యశ్రీ, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ యస్. వలీఖాన్, బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యూ ఎన్ శర్మ, సీనియర్ న్యాయవాదులు వి.ఈశ్వర్రావు, యమ్. అనూరాధ, జి.చిట్టి బాబు, గ్రంధాలయాధికారి డాక్టర్ లెఫ్టినెంట్ జి. స్వామి నాయుడు పాల్గొన్నారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న జడ్జి సరోజనమ్మ

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సముద్రంలో పడవ బోల్తా పడి మృతి చెందిన మండలంలోని పతివాడ బర్రిపేటకు చెందిన వాసుపల్లి అప్పన్న కుటుంబానికి మత్స్యశాఖ నుంచి దహన సంస్కరణలు ఖర్చుల నిమిత్తం వచ్చిన రూ. 10వేలను ఎంపిటిసి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు చేతుల మీదుగా శనివారం అందజేశారు. వైసిపి తరుపున రెండు ప్యాకెట్లు బియ్యాన్ని కూడా ఆయన ఆ కుటుంబానికి అందించారు. విలేజ్ ఫిషరీస్ సహాయకులు హేమంత్ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి మత్స్య శాఖ నుంచి రూ.10 లక్షలు క్లైమ్ అయినట్లు తెలిపారు. ముందుగా ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు ఇస్తున్నామన్నారు. మరో మూడు నెలల్లో రూ.5లక్షలు చెక్ ఇస్తామన్నారు. అనంతరం మరికొన్ని నెలల్లో మరో రూ.5 లక్షలు కుటుంబానికి అందజేస్తారని తెలిపారు. ఎంపిటిసి అప్పలనాయుడు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మధ్యలో దళారులు నమ్మొద్దని తెలిపారు. మీకు రావలసిన రూ.10 లక్షలు సచివాలయంలో ఉద్యోగుల ద్వారా నేరుగా మీకు పంపించే ఏర్పాటును ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ ఆర్థిక సహాయంలో ఎవరికి కమీషన్లు ఇవ్వద్దని, ఎవరైనా అడిగితే తమకు తెలియజేయాలని చెప్పారు. ఆయనతోపాటు పతివాడ వైసిపి నాయకులు పిన్నింటి నారాయణరావు, పతివాడ సత్యం, సచివాలయ కన్వీనర్ గనగళ్ల అప్పలరాజు, సాగర్ మిత్ర లేపాక్షి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆర్ శోభారాణి తదితరలు ఉన్నారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న పతివాడ అప్పలనాయుడు

తల్లిపాలే పిల్లలకు శ్రేయష్కరం

ప్రజాశక్తి- బొబ్బిలి

తల్లి పాలే శ్రేయష్కరమని, బిడ్డకు అవసరమైన పోషకాలు తల్లి పాలల్లోనే వుంటాయని సిహెచ్‌సి పిపి యూనిట్ డాక్టర్ సంతోషి కుమారి అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాలు- ప్రయోజనాలు అనే విషయం పై అవగాహన కార్యక్రమాన్ని రోటరీ కార్యదర్శి శ్రీ హరి, రీజినల్ మెంబర్ షిప్ చైర్ చంద్ర కిషోర్, ఫౌండేషన్ చైర్ శ్రీనివాసరావులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రవికుమార్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు ఇవ్వడం ఇరువురి ఆరోగ్యానికి శ్రేయస్కరమని అన్నారు. బిడ్డ ఎదుగుదలకు, ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి తల్లీ బిడ్డల అనుబంధానికి తల్లి పాలు దోహదం చేస్తాయని అన్నారు. తల్లి పాలు బిడ్డకు పట్టక పోవటం వల్ల కేన్సర్, బ్లడ్ ప్లెషర్, బ్లీడింగ్ సమస్యలు వస్తాయని తెలియచేసారు. రోటరీ అధ్యక్షులు జె సి రాజు మాట్లాడుతూ బిడ్డలు దేశానికి సంపదని ఆ సంపదను ఆరోగ్యకరంగా వృద్ధి చెందాలంటే తల్లి పాల వల్లే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిపి యూనిట్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బొబ్బిలి: తల్లిపాలుతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని కౌన్సిలర్ చోడి రమేష్ నాయుడు, ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. పాతబొబ్బిలిలో శనివారం తల్లిపాలు వారోత్సవాలు, గర్భిణులకు సీమంతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు పడితేనే పౌష్టికాహారం అంది ఆరోగ్యంగా ఉంటారన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగిస్తే వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, గర్భిణులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సమావేశాలొద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్‌వి చిన అప్పలనాయుడు మాట్లాడుతూ తూతూ మంత్రపు సమావేశాలు వద్దని, గత సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేసుకొని అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ సమీక్షతో మొదలైన సమావేశంలో ముచ్చర్లవలస గ్రామంలో ఎరువులు పంపిణీ జరగలేదని, గోడౌన్ ఉచితంగా ఇస్తామన్నా అధికారులు స్పందించడం లేదని సర్పంచ్ కనిమెరక శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎఒ వెంకటయ్య స్పందిస్తూ తమ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చి చర్యలు తీసుకుంటానని తెలిపారు. నాడు నేడు పథకంలో మండలంలో 21పాఠశాలలకు పనులు మంజూరు కాగా 10పాఠశాలల్లో ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని యస్‌యస్‌ఎ డిఇ తెలిపారు. భూశాయవలస పాఠశాలలో అదనపు తరగతి గదులు మంజూరైన సంవత్సరాల తరబడి నత్తనడకగా పనులు జరుగుతున్నాయని మామిడివలస ఎంపిటిసి మడక తిరుపతి నాయుడు అడిగారు. నిధులు విడుదల చేసిన వెంటనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రెవెన్యూ సమీక్షలో తహశీల్దార్ రాజారావు, సభ్యుల ప్రశ్నలకి సమాధానాలిచ్చారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించవలసిన ప్రజా ప్రతినిధులు సంఖ్య అంతంత మాత్రంగానే ఉండడం, సమాధానాలు చెప్పవలసిన అధికారులు తాము కొత్తగా ఇటీవలే జాయినయ్యామంటూ తప్పించుకోవడంతో సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతీ, ఎంపిడిఒ రమామణి, తహశీల్దార్ రాజారావు, వైస్ ఎంపిపిలు పెంకి అరుణ, బెల్లాన ప్రసాద్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

గ్రామాభివృద్ధికి సచివాలయాలే పట్టుగొమ్మలు

ప్రజాశక్తి- బొండపల్లి

సత్వర గ్రామాభివృద్ధికి సచివాలయాలే పట్టుగొమ్మలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శనివారం మండలంలోని ముద్దూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ మునకాల పైడినాయుడు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. సచివాలయాలు ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, వైస్ ఎంపిపిలు గొండెల ఈశ్వర రావు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, బొండపల్లి, గొట్లాం, రాచ కిండాం పిఎసిఎస్ అధ్యక్షులు బివి.ప్రభూజీ, మహంతి రమణ, గొల్లు సతీష్, తహశీల్దారు ప్రసాదరావు, ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సుగుణాకర్ రావు, హౌసింగ్ ఎఇ బివి.రమణ రాజు, వ్యవసాయ శాఖ ఎఇ మల్లికార్జున రావు, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎపిఎం సులోచనా దేవి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్ళపూడి కృష్ణ, సర్పంచ్, కర్రోతు శ్రీనువాస రావు, ఎంపిటిసిలు బండారు శ్రీనువాసరావు, తాళ్ళపూడి అప్పలనాయుడు, పాల్గొన్నారు



కొత్తవలస: బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామభద్రపురం: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే ఎస్‌వి చిన అప్పలనాయుడు శంకుస్థాపనలు చేశారు. రెల్లి వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన సుమారు రూ.10లక్షలతో నిర్మించబోతున్న సిసి రోడ్డు, మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే సిఎం జగనన్న ప్రధాన ధ్యేయమని, పనులు పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, మండల జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో గడపగడపకు..

కొత్తవలస: ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం చింతలపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు గురించి వివరించారు. ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ లెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, జెసిఎస్ మండల ఇన్చార్జ్ బొంతుల వెంకటరావు, మేలాస్త్రి అప్పారావు, మండల యువజన విభాగం అధ్యక్షులు ఐతంశెట్టి అనిల్ కుమార్, స్థానిక నాయకులు పల్లా భీష్మ, ఎంపిటిసి ఐతంశెట్టి నాగమణి, ఐతంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ పేరు నిలబెట్టండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు బాగా కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకు, సెంచూరియన్ విశ్వ విద్యాలయానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి పిలుపునిచ్చారు. శనివారం విశ్వ విద్యాలయంలో విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒకరు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు సంపాదించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు వున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీ డియోల్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో సెంచూరియన్‌తో బిఎస్ఎన్ఎల్ ఎంఒయు

బిఎస్ఎన్ఎల్‌తో సెంచూరియన్ విశ్వ విద్యాలయం త్వరలో ఎంఒయు కుదుర్చుకోనుందని ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు తెలిపారు. శనివారం బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సత్య ప్రసాద్, ఛాన్సెలర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. విద్యార్థులకు శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి తదితర అంశాలకు ఈ ఎంఒయు దోహద పడుతుందన్నారు. త్వరలో బిఎస్ఎన్ఎల్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారులకు సేవలు అందించనుందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సత్యప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా ఛాన్సెలర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు ఆయన ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సీనియార్టీకి ప్రాధాన్యత ఇచ్చి సర్వీసుల క్రమబద్ధీకరణలు పద్ధతిగా చేపట్టాలని జిల్లా మినిమం టైం స్కేల్స్ సిబ్బంది సంఘం నాయకులు మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిలను కోరారు. కలెక్టర్ ఆఫీసులో వారిని సంఘ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో 2000 సంవత్సరంలో నియామకాలు ప్రారంభమయ్యాయని దానికంటే ముందు 1993 నాటికి ఎన్ఎంఆర్, దినసరి వేతన, కన్సాలిడేటెడ్‌పి, ఫుల్ టైం, పార్ట్ టైం కంటింజెంట్ తదితర విధానాలలో నియమితులై ప్రస్తుతం మినిమం టైమ్ స్కేల్ పొందుతున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొదటగా వారి సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోరారు. దీనికి మంత్రులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మినిమం టైమ్ స్కేల్ సిబ్బంది సంఘ జిల్లా అధ్యక్షులు బి. శంకర్రావు, పంచాయతీరాజ్ ప్రతినిధి శంకర్రావు, ఆడిట్ శాఖ సిబ్బంది రాంబాబు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులకు సమస్యను వివరిస్తున్న సంఘ నాయకులు

బహిరంగ సభకు మద్దతు

ప్రజాశక్తి- బొబ్బిలి

మణిపూర్ మారణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 9న జరగనున్న బహిరంగ సభకు వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు సిపిఎం నాయకులు పి. శంకరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ భరతమాత సిగ్గుపడేలా మహిళలను నగ్నంగా ఊరేగించడం హత్యలు, హత్యాచారాలు అత్యంత పాసవికంగా జరిగిన ఆ ఘోరాలను ప్రజలందరూ ఖండించాలన్నారు. ఈ దాడులన్నీ బిజెపి కనుసన్నల్లో జరుగుతున్నాయని వెంటనే అక్కడ సిఎం రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 9న జరగనున్న ఈ బహిరంగ సభను ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు, ప్రజాతంత్ర వాదులు జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ నాయకులు ఎం. శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు నాయకులు ఎం. గోపాలం, కాంగ్రెస్ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, రైతు కూలీ సంఘం నాయకులు వి. కృష్ణ, పికెఎస్ నాయకులు టి. అప్పలనాయుడు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులు

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస గ్రామ పంచాయతీ పరిధిలోని బిళ్లవలసలో నాయకులు తిరుమల రాజు అప్పల నరసింహరాజు ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పలు వీధుల్లో ఉన్న కాలువల పూడిక తీతలు, బోర్లు వద్ద నిలువ ఉన్న మురుగు నీటిని తొలగించటం, పిచ్చి మొక్కలు తొలగించటం, బ్లీచింగ్ చల్లటం వంటి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

వంగరలో తిష్ట వేసిన ఏనుగులు


ప్రజాశక్తి- వంగర

రెండు వారాలుగా మండలంలో ఏనుగులు తిష్ట వేశాయి. వివిధ గ్రామాలలో చెరకు, మొక్కజొన్న, వరి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని శివ్వాంలో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన బలగ సత్యం నాయుడు, బలగ పోలి నాయుడు, బలగ రామారావు, కొక్కిరిగెడ్డ లక్ష్మణ తదితర రైతుల చెరకు, మొక్కజొన్న, వరి పంటలను ధ్వంసం చేయడంతో పాటు, అంబల్ల సత్యంకు చెందిన ట్రాక్టర్ ఇంజిన్, విద్యుత్ మోటారులను ధ్వంసం చేశాయి. శనివారం ఉదయం మండలంలోని తలగాం పంట పొలాల్లోకి చేరుకున్నాయి. అక్కడ పంటలను ధ్వంసం చేయడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

యథేచ్చగా అక్రమ మైనింగ్

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో బుధరాయవలస, గర్భాం, కొత్త కర్ర గ్రామాల సరిహద్దుల్లో యథేచ్చగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని బిజెపి మండల అధ్యక్షులు సరిది రాము నాయుడు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. కాగా వారందరికీ ఇందులో వాటాలున్నాయని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు ఈ అక్రమ మైనింగ్‌ను ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.



రామునాయుడు